క్లుప్తంగా

ఏపీ రైతు సంఘంలో సభ్యత్వం తీసుకోండి



రైతులకు సభ్యత్వం ఇస్తున్న జి.రామకృష్ణ

కర్నూలు(సెంట్రల్) : ఏపీ రైతు సంఘం రైతుల కోసం పోరాటం చేసే సంఘమని, ఈ సంఘంలో పార్టీలకు అతీతంగా సభ్యత్వాలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ఉలిందకొండ గ్రామంలో ఆ సంఘం సభ్యత నమోదు కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఈ సందర్భంగా ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మల్య, పి.అనుమంతు, రంగస్వామి, రంగారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



పడుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కర్నూలు(సెంట్రల్) : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి పి.నిర్మల డిమాండ్ చేశారు. శనివారం సమ్మెలో భాగంగా శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో అంగన్‌వాడీలు వినూత్నంగా పడుకొని నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా నాయకులు గోపాల్, నాయకులు సుధాకరప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

రజకులపై దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్) : గ్రామీణ ప్రాంతాల్లో రజకులకులపై దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఇ ందుకోసం అట్రాసిటీ చట్టం తరహాలో చట్టం చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురుశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ రజక వృత్తిదారుల సంఘం 2024 నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ..వచ్చే బడ్జెట్ సమావేశాల్లో రజకుల కోసం రూ.1000 కోట్లను కేటాయించాలన్నారు. రజకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముక్కన్న, నాయకులు శేషాద్రి పాల్గొన్నారు.

కారాగారాల సందర్శన



జిల్లా జైలులో ఖైదీల భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్ పంచలింగాల గ్రామంలో ఉన్న జిల్లా జైలు, మహిళా జైలును సందర్శించారు. జైలులోని ఖైదీల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి



బీజేపీ జెండాను ఎగుర వేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం 44వ వార్డులోని మమత ఆటోనగర్ స్టాండు, 45వ వార్డులోని లేబర్ కాలనీ జంక్షన్ వద్ద బీజేపీ జెండాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలిచి మరోసారి మోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకరరెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీరాములు, భగత్, రామాంజనేయులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రాధాన్యం

- పాతబస్తీలో మౌలిక సదుపాయాల కల్పన పనులు వేగవంతం
- ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



గుమ్మజ్ దర్గాలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు (టౌన్): నగరాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. స్థానిక గుమ్మజ్ దర్గా వద్ద జరుగుతున్న వివిధ ప్రగతి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోల్కొండ తరహాలో గుమ్మజ్‌దర్గాను తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పర్యాటక శాఖ నిధులు రూ.7లక్షలతో గ్రీనరీ, టాయిలెట్ల ఏర్పాటు పనులు చేస్తున్నట్లు చెప్పారు. దీంతో పాటు ప్లే గ్రౌండ్, పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా వాక్‌ట్రాక్, దర్గా చుట్టూ విద్యుత్ అలంకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. నియోజకవర్గంలో రూ.కోట్లరూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పాతబస్తీలోని ప్రతి వార్డులో మురుగు కాలువలు, సీసీ రోడ్లు, కల్వర్టులు, పైప్‌లైన్ ఏర్పాటు తదితర పనులు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ షేక్ యూనుస్ బాషా, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు

స్థానిక ఉస్మానియా కళాశాలలో ఆడుదాం- ఆంధ్ర క్రీడాపోటీల్లో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ పాల్గొని మాట్లాడారు. గ్రామ, వార్డు స్థాయి నుంచే క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులు మంచి ప్రతిభ చాటి వచ్చే నెల 10న విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అర్షియా పర్వీన్, జుబేర్ అహ్మద్, షేక్ యూనుస్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

నియోజకవర్గంలో సమస్యలు ఏవైనా ఉంటే వాటిని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ స్పష్టం చేశారు. శనివారం తన నివాసంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అక్కడినుంచే నేరుగా సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



రైతులకు మోటర్ పంపుసెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహంలో వైఎస్సార్ జలకళ కింద బోర్లు వేసిన ఓర్వకల్లు మండలం ఎస్.కొంతలపాడు, గుట్టపాడు గ్రామాలకు చెందిన రైతులకు మోటర్ పంపుసెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన సన్న, చిన్నకారు రైతులకు వైఎస్సార్ జలకళ కింద బోర్లు మంజూరు చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకోలేదని తమ ప్రభుత్వం ఉదయమే రైతులకు వ్యవసాయ విద్యుత్ అందిస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు అందుబాటులో పెట్టామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మన్న, టీసీ గౌస్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి, ఎస్.కొంతలపాడు, గుట్టపాడు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు అర్జీలను 9లోపు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్) : పెండింగ్‌లోని ఫారం 6,7,8 ఓటరు అర్జీలను ఈనెల 9వ తేదీలోపు పరిష్కరించాలని పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫొటో, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీలను త్వరగా పరిష్కరించాలన్నారు. మార్పులు, చేర్పులను సరైన ప్రణాళికలతో చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యంతరాలను పరిశీలించేందుకు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రమేష్ బాబు, వైఎస్ఆర్‌సీపీ నుంచి అక్కిమి అనుమంత రెడ్డి, కాంగ్రెస్ నుంచి శ్రీనివాస యాదవ్, బీజేపీ నుంచి రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ నుంచి యశ్వంత్‌రెడ్డి, బీఎస్పీ నుంచి చిరంజీవి, సీపీఐ నుంచి శ్రీనివాసరావు, సీపీఎం నుంచి రామకృష్ణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల్లో డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: వాతావరణంలో మార్పులతో కలిగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రామగిడ్డయ్య వైద్య సిబ్బందికి ఆదేశించారు. శనివారం కల్లూరు మండలం పర్ల గ్రామంలోని సచివాలయం-2, కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలోని సచివాలయం-1లో జరుగుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీసీ, ఆరోగ్య శ్రీ, కంటి వెలుగు తదితర వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి జ్వర పీడితులను గుర్తించి వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు. అనంతరం ఆయా సచివాలయాల్లో రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక గాయత్రీ జపం



సామూహిక గాయత్రీ జపం కార్యక్రమానికి హాజరైన శ్రీరామచంద్రమూర్తి

కర్నూలు (న్యూటౌన్): నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం శతకోటి గాయత్రీ జప బృందం హరిహర క్షేత్రంలో సామూహిక గాయత్రీ జపం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన సంధ్యావందనం అభ్యాసన శిక్షణా సమితి అధ్యక్షుడు గురువు కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి హాజరై వేదవిద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ శర్మ, కర్నూలు శతకోటి గాయత్రీ జప కోఆర్డినేటర్ ఫణిరాజ్, బ్రాహ్మణ సంఘం నగర కార్యదర్శి రాజశేఖర్‌రావు, ఏపీ బ్రాహ్మణ సేవ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

4న విజయవాడలో గ్రామీణ వైద్యుల మహాసభ



మహాసభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేజీ గోవిందరెడ్డి తదితరులు

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ వైద్యుల సంఘాల సమాఖ్య (ఫెడరేషన్) ఆధ్వర్యంలో విజయవాడలో వచ్చే నెల (ఫిబ్రవరి) 4వ తేదీన గ్రామీణ వైద్యుల మహాసభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామీణ వైద్యుల పోరాట సభ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేజీ గోవిందరెడ్డి చెప్పారు. శనివారం స్థానిక బుధవారపేటలోని పద్మచంద్ర నర్సింగ్ కళాశాల ఆడిటోరియంలో కర్నూలు జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాసభ, క్యాన్సర్‌పై పోరాట సభ పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీన గ్రామీణ వైద్యులందరూ విజయవాడ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తెలకపల్లి రాధాకృష్ణయ్య, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు/నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర నాయకులు ఉస్మాన్, దస్తగిరి పర్ల, ఇల్లూరు నరసింహ, రఘునాథరెడ్డి, నాగేశ్వరరావు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థినికి సూచనలు చేస్తున్న రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరమవుతాయని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం జిల్లా అధికారిణి హేమలత చెప్పారు. శనివారం కర్నూలు నగరంలోని ఫోర్ట్ ఏరియాలో ఉన్న నగర పాలక ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు భోజనం తినే ముందు, మరుగుదొడ్లకు వెళ్లిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోతే జీర్ణవ్యవస్థలో ఇబ్బందులు ఎదురై వాంతులు, కడుపునొప్పి, విరేచనాలు, ఇతర వ్యాధులు సోకుతాయని చెప్పారు. ఆకుపచ్చ కూరగాయలు, సీజనల్‌గా దొరికే పండ్లను తినాలని, ఇంట్లో వండిన ఆహారమే ఆరోగ్యానికి చాలా మంచిదని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ అంబికా, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



లోక శ్రేయస్సును కాంక్షిస్తూ..

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి కల్లూరులోని తన నివాసంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

విలువలు లేని నాయకుడు చంద్రబాబు

- పేదలకు అందిస్తున్న సాయాన్ని చూసి ఓర్వలేకపోతున్నారు
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ధ్వజం
- కర్నూలు అర్బన్‌లో లబ్ధిదారులకు పెంచిన పెన్షన్ పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్



కార్యక్రమానికి హాజరైన ఫించన్‌దారులు

కర్నూలు సిటీ: 'ఎంతో రాజకీయ అనుభవం ఉందని, దేశంలో తనంత సీనియర్ నాయకుడు లేడని చెప్పుకునే చంద్రబాబు నాయుడుకు విలువలు, విశ్వాసనీయత లేదు. రాజకీయ స్వార్థం కోసం ఆయన కుటుంబాల మధ్య చిచ్చు పెడుతారని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ మండిపడ్డారు. శనివారం కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించి నగరంలోని మూడు వార్డుల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందజేస్తుండడంతో తెలుగు దేశం పార్టీ నాయకులు చూసి తట్టుకోలేకపోతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదల కడుపు కొట్టి పెత్తందారులకు మేలు చేసిన బాబు ఏ రోజు కూడా పేద వర్గాల గురించి ఆలోచించ లేదన్నారు. చంద్రబాబు నాయుడికి ప్రజలు ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తుకు వస్తారని, తర్వాత పట్టించుకోరని చెప్పారు. ఇందుకు 2014 నుంచి 2019 వరకు బాబు సాగించిన పాలనే నిదర్శనమన్నారు. తమ అధినేత వైఎస్ జగన్ 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ. 3000కు పెంచారన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్లకు నోచుకోని మాసమసీదు ప్రాంతంలోని కాలనీలకు నేడు రోడ్లు వేయించామని, తుంగభద్ర నది పక్కనే ఉన్న మునగాలపాడు గ్రామంలో సుమారుగా రూ.40 లక్షలు ఖర్చు పెట్టి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, గిబ్సన్, జేసీఎస్ కన్వీనర్ కరీం, స్థానిక నాయకులు భాస్కర్, రాంబాబు, రామకృష్ణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మెన్ యాకోబ్, స్వాములు, శివ చైతన్య, మహేష్ గౌడ్, ప్రసాద్, మద్దిలేటి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ తరగతులు

కర్నూలు (లీగల్): జిల్లా కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్ పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పారా లీగల్ వలంటీర్లకు ఫ్యామిలీ లా, గృహ హింస చట్టం, విడాకుల చట్టం, మధ్యవర్తిత్వం, భరణం, ఫ్రీ లీగల్ ఎయిడ్, లీగల్ సర్వీస్ అథారిటీ యాక్ట్ 1987, న్యాయ విజ్ఞాన సదస్సుల ప్రాముఖ్యత, లీగల్ ఎయిడ్ టు ప్రకృతి వైపరీత్యాలకు న్యాయ సేవల పథకం తదితర చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భారతీయ సంస్కృతి ఉత్సవం



గంగిరెద్దు ప్రదర్శన

కర్నూలు సిటీ: జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం భారతీయ సంస్కృతి ఉత్సవం నిర్వహించారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయల గురించి వివరించేందుకు వివిధ నాటికలు ప్రదర్శించారు. ఇందులో విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలు, దేవతలు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు ధరించి ఆకట్టుకున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఎడ్ల బండ్లు, గంగిరెద్దుల ప్రదర్శన, ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ అఫైర్స్ డీన్ డా.వైవీ మోహన్ రెడ్డి, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.



భోగి మంటలు వేస్తున్న దృశ్యం

స్పోర్ట్స్

ఆల్ ఇండియా పోటీలకు ఆర్‌యూ జట్టు

కర్నూలు (టౌన్): ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు చెన్నై రాష్ట్రంలోని ఎస్ఆర్ఎం సైన్స్, టెక్నాలజీ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా అంతర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో రాయలసీమ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ జట్టు పాల్గొంటున్నట్లు ఆ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రెహమాన్ తెలిపారు. శనివారం బ్యాడ్మింటన్ క్రీడాకారులు ప్రణవి, ఆకాంక్ష, జాహ్నవి, సింధు, ఫరీహాశరీన్, కోచ్ హేమంత్‌రెడ్డిని వీసీ అభినందించి మాట్లాడారు. ఈనెల 2 నుంచి 5 వ తేదీ వరకు విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీలో నిర్వహించిన సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ టోర్నమెంటులో రాయలసీమ జట్టు మూడో స్థానంలో నిలిచి ఆల్ ఇండియా పోటీలకు అర్హత సాధించిందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ సీవీ క్రిష్ణరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుందరానందాపుచ్ఛ పాల్గొన్నారు.

అథ్లెట్ వినోద్‌కు అభినందన



అథ్లెట్ వినోద్‌ను అభినందిస్తున్న డీవీఈఓ జమీర్

కర్నూలు (టౌన్) : జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన కోల్స్ జూనియర్ కళాశాలకు చెందిన అథ్లెట్ వినోద్‌ను స్థానిక డీవీఈఓ కార్యాలయంలో శనివారం జిల్లా వృత్తివిద్యాధికారి జమీర్ అభినందించారు. గత ఏడాది నవంబర్‌లో పల్నాడు జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్లు, 800 మీటర్ల పరుగులో బంగారు పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యాడు. గతేడాది డిసెంబర్ 22, 23 తేదీల్లో మహారాష్ట్ర బాలాపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని వ్యక్తిగత ప్రతిభ చాటాడు. ఈ నేపథ్యంలో డీవీఈవో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మన జిల్లాకు చెందిన విద్యార్థి ప్రతిభ చాటడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు గడ్డం రామక్రిష్ణ

కర్నూలు (టౌన్): ఈనెల 12, 13 తేదీల్లో రాజంపేటలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాలని వైఎస్ఆర్‌సీపీ నాయకులు గడ్డం రామక్రిష్ణ అన్నారు. శనివారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హ్యాండ్‌బాల్ క్రీడను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు హ్యాండ్‌బాల్ సంఘం నాయకులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పతకాలతో తిరిగి రండి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

కర్నూలు (టౌన్) : ఈనెల 9 నుంచి 11 వరకు తిరుపతి పట్టణంలో జరిగే 11 వ హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో హాకీ కర్నూలు ఆధ్వర్యంలో జూనియర్ బాలుర ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మాట్లాడుతూ హాకీలో కర్నూలు జిల్లాకు మంచి పేరు ఉందన్నారు. ఇదే సంప్రదాయాన్ని క్రీడాకారులు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు, హాకీ కర్నూలు కార్యదర్శి దాసరి సుధీర్, నిర్వహణ కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు, టోపీల అందజేత



టీషర్టులు, టోపీలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కేదార్‌నాథ్ మాదారావు

కర్నూలు (టౌన్): నగరంలోని మైపర్ కళాశాల క్రీడా మైదానంలో 15వ వార్డులోని 35, 36, 37 సచివాలయాల క్రీడాకారులకు వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు, పార్టీ క్లస్టర్-2 అధ్యక్షుడు కేదార్‌నాథ్ మాదారావు ఆడుదాం ఆంధ్ర టీషర్టులు, టోపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. లక్షమందికి పైగా క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవడం విశేషమన్నారు. క్రీడాకారులకు సర్కారు ఇప్పటికే స్పోర్ట్స్ కిట్లు, నగదు ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. అనంతరం 36వ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనంతరం క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరమ్మ, పర్ల సూర్యుడు, వసంత్, ఆదిశేషు, జోనల్ ఆఫీసర్ రాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ క్రికెట్ పోటీలకు ఉస్మానియా విద్యార్థి

కర్నూలు (టౌన్): ఈనెల 7 నుంచి 16 వ తేదీ వరకు చెన్నై రాష్ట్రంలోని హిందూస్థాని యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఉస్మానియా కళాశాలకు చెందిన మూడవ సంవత్సరం విద్యార్థి పి. సాయితేజ ఎంపికయ్యాడు. శనివారం స్థానిక ఆ కళాశాలలో ప్రిన్సిపాల్ సయ్యద్ సమీయుద్దీన్ ముజ్జమిల్ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రఫీక్ అహమ్మద్ పాల్గొన్నారు.

మున్సిపల్ దుకాణాలకు వేలాలు

కర్నూలు (టౌన్) :నగరంలోని స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న మున్సిపల్ షాపులకు శనివారం నగరపాలక కౌన్సిల్ హాలులో వేలాలు నిర్వహించారు. 12 షాపులకు అత్యధికంగా 42 మంది పోటీ పడ్డారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ లాటరీ పద్ధతిలో షాపులను కేటాయించామన్నారు. వేలాల ద్వారా నగరపాలక రెవెన్యూ విభాగానికి రూ.12 లక్షలు ఆదాయం వస్తుందని చెప్పారు. రెవెన్యూ ఆఫీసర్ జునీద్, మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.